# చందు


**పి.వి.కృష్ణకాంత్**


‘‘మీ పేరేంటి?’’

గుర్తొచ్చినప్పుడల్లా నవ్వొస్తోంది. ‘‘మీ’’ అన్న మాటకైతే మరీ మరీ నవ్వొస్తోంది. లేక పోతే నన్నేంటి, ‘మీరు’ అనడమేంటి? అసలు పేరు అడగటమే విచిత్రం. అందులో గౌరవించడం మరీ విచిత్రం. ఇక్కడికొచ్చిన వాళ్ళంతా, శవానికి చర్మం ఒలిచినట్లు బట్టలిప్పి ఈ శరీరంతో ఇష్టమొచ్చినట్లు ఆడు కుని వెళ్ళే వాళ్ళే కానీ, పేరు అడిగిన వాళ్ళూ లేరు. అందుకే నెల క్రితం ఆరోజు అతనలా గౌరవంగా అడిగినప్పుడు నవ్వొచ్చి ఆపుకో లేక అతని ముందే నవ్వేశాను.

పాపం! అతను ఆశ్చర్యపోయాడు.

కాని వెంటనే ‘‘మీరు నవ్వితే చాలా అందంగా వున్నారు’’ అనేశాడు.





**అప్పుడు నేనాశ్చర్యపోయాను.**

అయినా, అందమా! అది కొందరికి అదృష్టం. కొందరికి శాపం. బహుశా ఆ అందం వల్లేనేమో నాకు ఒక్కోరోజు తినడానికి కూడా తీరికుండదు.

నాపేరు గుర్తుచేసుకుని చాలా రోజులయిపోయింది. అవసరమొస్తే అప్పటికప్పుడు ఏదో ఒక పేరు చెప్పేయడమే తప్ప, అసలు పేరు ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పలేదు. ఇష్టం లేదు.

కానీ, ఎందుకు! ఇతనికి నా పేరు చెప్పాలన్పించింది. ఇతను అందరిలాగా లేడు. ఎప్పుడూ ఇక్కడికొచ్చే వాళ్ళ లాగా అసలు లేడు.

అందుకే చెప్పాను ''చంద్రిక'' అని.

మా నాన్న పెట్టిన పేరది. 'చందూ' అని పిలిచేవారు. నేనంటే చాలా ప్రేమ. నా పదో తరగతిలో ఒక రోజు స్కూల్‌నుండి ఇంటికి రాగానే ఇంటి ముందు జనం. నాన్న ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు, అవమానాలు తట్టుకోలేక ఒంటరినైపోయాను. అనాథనైపోయాను. ఆ తరువాత కొన్ని రోజులకి మా ఊరు నుంచి కొంతమంది పనికోసం పూణే బయల్దేరుతుంటే నేనూ బయల్దేరాను. తర్వాత తెలిసింది, ఆ పనేంటో! ఇక అప్పటి నుంచి ఇదే జీవితం.

ఇతని వల్ల పాత విషయాలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఇంతలో అతను, ''చంద్రిక! చాలా మంచి పేరు. మీకభ్యంతరం లేకపోతే 'చందూ' అని పిలుస్తాను'' అన్నాడు.

నా మనసులో మాటలు వినిపించాయేమో అనిపించింది. ఆ పేరులో ఏముందోగాని, అతనలా అనగానే తెలియకుండా కన్నులు తడవడం మొదలయింది. ఎప్పుడో ఎండిపోయిన కన్నీళ్ళ బావి మళ్ళీ ఊరుతోంది. కానీ బలవంతంగా ఆపేసి అలవాటయిపోయిన నకిలీ నవ్వును పెదాలపై అతికించుకున్నాను.

ఎందుకో తెలియదుగానీ, అతనలా పిలిస్తే వినాలనిపించింది. పిలిపించుకోవాలనిపించింది.

''మీ యిష్టం'' అన్నాను.

ఇంతలో అతను తెచ్చుకున్న కాగితాలు కిందపడ్డాయి. తీసి ఇవ్వబోతూ చూశాను. ఏదో రాసి వుంది. కవితల్లా ఉన్నాయి.

''ఇవి కవితలా?'' అడిగాను.

''అవును''

''మీరు రాసినవేనా?''

''అవును''

''చదవచ్చా?'' కొంచెం జంకుతూనే అడిగాను.

''మీకు కవితలంటే ఇష్టమా?'' అడిగాడు.

నవ్వాను. జవాబు చెప్పలేదు. చదువుతూ పోయాను. అద్భుతంగా ఉన్నాయా కవితలు. నేను చదువుతున్నంతసేపూ ఓపిగ్గా కూర్చున్నాడు. మధ్యలో నాకొచ్చిన అనుమానాలు తీర్చాడు. అలా మాట్లాడుతున్నప్పుడు సరదాగా నవ్వించాడు. అలా నవ్వి చాలా రోజులయింది. మనస్ఫూర్తిగా నవ్విన స్వచ్ఛమైన నవ్వులవి. నా గురించి అడిగాడు. చెబుతున్నప్పుడు కన్నీళ్ళొస్తే తుడిచాడు. అతని మాటల్లో ఏదో మాయ ఉంది. అది మనసులోని చీకట్లను మాయం చేస్తోంది.

**అతని సమక్షంలో నేనేమిటో మర్చిపోయాను. కన్నీళ్ళని మర్చిపోయాను. కలల లోకంలోకి వెళ్ళిపోయాను. అలా వర్ణిస్తూ వచ్చి నా చేతిని ముద్దు పెట్టుకున్నాడు. ఆ స్పర్శకు ఒళ్ళంతా నన్నని పులకింత ప్రవహించింది. ఎప్పుడో శిథిలమయిందనుకున్న ఈ శరీరంలో ఇంకా స్పందనలున్నాయా!**

ఆ కవితలన్నీ చదివాక నాకో చిన్న ఆశ కలిగింది.

''మీరిప్పుడు నా మీద కవిత చెప్పగలరా, ఇష్టం లేకపోతే మాత్రం వద్దు'' తెగించి అడిగేశాను.


చిన్న నవ్వు నవ్వి ''ప్రయత్నిస్తాను'' అని చెప్పడం మొదలుపెట్టాడు. ఎంత అందమైన వర్ణనలు. అందరూ గాయాలిచ్చిన ఈ శరీరానికి ఇతను గేయాలిచ్చాడు.

అతని సమక్షంలో నేనేమిటో మర్చిపోయాను. కన్నీళ్ళని మర్చిపోయాను. కలల లోకంలోకి వెళ్ళిపోయాను. అలా వర్ణిస్తూ వచ్చి నా చేతిని ముద్దు పెట్టుకున్నాడు. ఆ స్పర్శకు ఒళ్ళంతా నన్నని పులకింత ప్రవహించింది. ఎప్పుడో శిథిలమయిందనుకున్న ఈ శరీరంలో ఇంకా స్పందనలున్నాయా! అని నేనే ఆశ్చర్యపోయాను. అతను కౌగిలించుకున్నపుడు గాయాలతో నిండిన ఒంటికి వెన్నెలని లేపనం చేసి పూస్తున్నట్లు అనిపించింది. అతని శ్వాసలు తగిలినప్పుడల్లా తొలి సంధ్యలో నునువెచ్చగా తాకే చిరుగాలులు గుర్తుకొచ్చాయి. అతను తాకుతున్న ప్రతి కణమూ క్రమంగా జీవం పోసుకున్నాయి. పాము కుబుసం విడిచినట్లు పాత శరీరాన్ని పారేసి, కొత్త శరీరంలోకి వచ్చిన అనుభూతి. వీణను మీటినట్లు అంగాంగాన్నీ తాకి నిట్టూర్పుల సంగీతం పలికించాడు. అణువణువునూ ఆవిరి చేస్తూ ఊహించలేని ఉన్మాదస్థాయికి తీసికెళ్ళాడు. నా మనసూ, శరీరమూ ఏదో మత్తులో తేలిపోయాయి. ఆ వెచ్చని కౌగిలిలో కరిగిపోయాయి. అతని హృదయాన్ని తెరుచుకుని, అతనిలో నన్ను నేను దాచుకోవాలనిపించింది. ఆ రాత్రి గంటలన్నీ క్షణాలుగా మారిపోయాయి.

తన్మయత్వం. నా లోపలి మంటలు మంచులా మారిపోయినంత చల్లదం శరీరంలో నిండిపోయింది. అలాగే అతని గుండెల మీద పడుకున్నాను. ఈ ప్రపంచాన్ని నన్ను నేను మరచిపోయిన ప్రశాంత క్షణాలు. ఇతనిలాగే నన్ను తీసుకుని ఎగిరిపోతే బావుణ్ణని కోరిక. ఈ ఊహలు, ఆశల నడుమ నిద్రపోయాను. ఆదమరిచి ప్రశాంతంగా నిద్రపోయాను. ఎప్పుడో చిన్నప్పుడు పోయిన నిద్ర, మరిచిపోయిన నిద్ర అది.

మెలకువ వచ్చేసరికి అతను లేడు. ఎంత అందంగా గడిచిందీ రాత్రి. నన్ను మనిషిగా కూడా గుర్తించని లోకంలో, ఒక ప్రేయసిగా గడిపిన ఆ ఒక్క రాత్రి చాలు. ఇక ఈ జీవితం నాకొద్దు. ఈ బ్రతుకు అనవసరం. కానీ, అతను మళ్ళీ వస్తే.. ఈ





ఊహే నాకు ప్రాణం పోసింది. అతని ఆలోచనే నన్ను బతికిస్తోంది.

ఈ నెల రోజులు అతన్ని తలచుకోని క్షణం లేదు. నా శరీరం ఎలా ఉన్నా మనసంతా అతనే నిండిపోయాడు. ఇంకొక్కసారి అతను నాకోసం వస్తేచాలు. ఆ తర్వాత ఏమైనా అయిపోతాను. కళ్ళు తుడుచుకుని కిటికీ లోంచి చూశాను. ఆరోజు నుంచి చూస్తూనే వున్నాను.

చీకట్లు అలుముకున్నాయి. దీపాలు వెలిగాయి. జనాల తాకిడి పెరుగుతోంది. ఎవరిటొచ్చినా అతనే అని భ్రమిస్తున్నాను. ఎవరో దూరంగా ఇటే వస్తున్నారు. అతనేనా? అవును. అతనే. ఒక్కసారిగా నాలో ఏదో వెలుగు, సంచలనం. అణువణువూ చైతన్యవంతం అయింది. అతనిటువైపే వస్తున్నాడు. నాకోసమే అయుంటుంది. అవును, నాకోసమే. అతనిక్కడికి వచ్చేలోపు ఈ రూపం మారిపోవాలి. ఈ నెల రోజులూ కన్నీటితో తడిసిన ఈ శరీరం శుభ్రమైపోవాలి. హడావుడిగా స్నానించాను. నాకిష్టమైన చీరకట్టాను. పరిగెత్తుతున్నాను గదిలో అటూ ఇటూ. కళ్ళకి కాటుక, నుదుట బొట్టు, చేతులకి గాజులు, పాదాలకి గజ్జెలు, నాకిష్టమైనట్లు సింగారించుకున్నాను. అద్దంలో ఈ రోజు కొత్త చందూ కనిపించింది. చాలా అందంగా కనిపించింది.

ఈ పాటికి వచ్చేసుంటాడు. తలుపు తీసుకుని బయటకు వచ్చాను. వచ్చేశాడు. మెట్లెక్కి పైకొస్తున్నాడు. నాకోసం, ఈ చందూ కోసం. నా గదివైపే వస్తున్నాడు. కళ్ళనిండా అతన్నే నింపుకున్నాను. కన్నార్పే క్షణంలో అతన్ని చూడలేనని కన్నార్పకుండా చూస్తున్నాను. అతనిటువైపు వేస్తున్న ఒక్కొక్క అడుగుకీ నా హృదయం వేగం పెరిగిపోతోంది. వచ్చేశాడు. నా దగ్గరికి వచ్చేశాడు. నన్ను చూశాడు.

కానీ... ఏం జరుగుతోంది. కళ్ళ ముందు చీకట్లు కమ్మేశాయి. గుండె ఆగిపోయి మళ్ళీ కొట్టుకుంది. ఆలోచనలన్నీ మొద్దుబారిపోయాయి. నేను

చీకట్లు అలుముకున్నాయి. దీపాలు వెలిగాయి. జనాల తాకిడి పెరుగుతోంది. ఎవరిటొచ్చినా అతనే అని భ్రమిస్తున్నాను. ఎవరో దూరంగా ఇటే వస్తున్నారు. అతనేనా? అవును. అతనే. ఒక్కసారిగా నాలో ఏదో వెలుగు, సంచలనం. అణువణువూ చైతన్యవంతం అయింది. అతనిటువైపే వస్తున్నాడు. నాకోసమే అయుంటుంది. అవును, నాకోసమే. అతనిక్కడికి వచ్చేలోపు ఈ రూపం మారిపోవాలి. ఈ నెల రోజులూ కన్నీటితో తడిసిన ఈ శరీరం శుభ్రమైపోవాలి.

చూస్తోంది నిజమేనా!

నన్నుచూసి అతను తల తిప్పుకుని వెళ్ళిపోతున్నాడు. నన్ను చూడలేదేమో... లేదు. చూశాడు. మర్చిపోయాడేమో! గుర్తుచేశాను. 'చందూ' నని గుర్తుచేస్తాను. తన చందూనని గుర్తు చేస్తాను. అతని వెనకాలే పరిగెత్తాను. వెనకకి తిరగలేదు. చూడలేదు. కొంచెం దూరంలో ఉన్నాడు. ఉన్నట్టుండి.. హఠాత్తుగా అక్కడున్న అమ్మాయిని తీసుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. నాచూపుల నుండి మాయమైపోయాడు. నా కలల నుంచి కరిగిపోయాడు. కనిపించనంత దూరంగా వెళ్ళిపోయాడు. కుప్పకూలిపోయాను. అంతా చీకటి. చూస్తూనే వున్నాను, అతనెళ్ళిన గదివైపు. నా లోపలినుంచి ఏదో పైకి పొంగుతూ వస్తోంది. అది ప్రాణమైతే బావుణ్ణు. పోతే బావుణ్ణు. ఇలాగే అతను నడిచిన నేలపై నా శరీరం శాశ్వతంగా సమాధైపోతే బావుణ్ణు. కానీ దురదృష్టం. అది ప్రాణం కాదు. దుఃఖం, ఏడుపు. అతనికది కేవలం ఒక రాత్రి. కానీ నాకతడు చంద్రుడు. అమావాస్య జీవితంలోకి వచ్చిపోయిన పున్నమి. తిరిగి రాని వెన్నెల. అయినా తప్పు నాది. ప్రేమించే హక్కు, ప్రేమించబడే అర్హత రెండూ ఈ జీవితానికి లేవు.

చుట్టూ కమ్మిన చీకటి నుంచి రెండు పాములు భయంకరంగా బుసలు కొడుతూ నావైపు దూసుకొచ్చాయి. అవి వాస్తవం, జీవితం.

★